## భయపెట్టే కథ

# అలౌకికం

**శ్రీదేవి మురళీధర్**

సూర్యాస్తమయం కాకమునుపే ముసురు మొదలైంది.

నిన్నటి వర్షానికి నేలంతా చిత్తడిగా వున్నది. వాతావరణం చలి చలిగా ఉంది. ఊరు ఎప్పటిలాగే నిశ్శబ్దంగా వుంది. వీధుల్లో జనసంచారం రోజూ మాత్రం కూడా లేదు. వాకింగ్‌కని బయలుదేరినవాణ్ణి పరధ్యానంగా ఏదో ఆలోచిస్తూ చాలాదూరం వచ్చినట్లున్నాను.

చొక్కా తడవటంతో తప్పనిసరై గొడుగు తెరిచాను. ఈదురుగాలికి చెట్లు అసహనంగా ఊగుతున్నాయి. 'దయ్యం పట్టినట్టు' అనుకున్నాను నవ్వుకుంటూ. అరె బురదలో దిగిన కాలి వంక చూశాను. చెప్పు రింగు తెగింది. ఇదీ ఇప్పుడే జరగాలా? విసుగ్గా నిట్టూర్చి చుట్టూ చూశాను. మరీ దగ్గరలో కాదు కానీ ఓ నలభై అడుగుల దూరంలో ఒక చక్కటి మేడ కనిపించింది. బతుకు జీవుడా అనుకుని చెప్పుచేత పట్టుకుని అటుగా నడిచాను.

సన్నసన్నగా చీకట్లు ముసురుకుంటున్నాయి. ఎక్కడో దూరంగా మినుకు మినుకుమని దీపాలు కనిపిస్తున్నాయి. కొద్దిగా కాలదోషం పట్టినట్లు కనిపిస్తున్న ఆ మేడగేటును సమీపించాను. చెక్కగేటుకి ఇంటికీ మధ్య కొద్దిపాటి దూరం ఉన్నది. గేటు పాతముఖం పడి అక్కడక్కడా విరిగి ఉన్నది. ఇంట్లో దీపం పెట్టిన జాడ కనిపించలేదు. వాన గాలి మాంఛి ఊపందుకున్నది. ఉన్నట్లుండి ముసురు కుండపోతగా మారింది. చెప్పుచూస్తే చేతికొచ్చింది. దగ్గర్లో ఇళ్ళేవీ కనబడలేదు. చేసేది లేక నెమ్మదిగా గేటు తీశాను. లోపలికి అడుగుపెట్టి గేటు మూసి ఇంటివైపు తిరిగాను. వరండాలో లైటు వెలుగుతోంది. హమ్మయ్య! అనుకుని బురదలో జాగ్రత్తగా అడుగులేస్తూ ముందుకు నడిచాను. కుడివైపు గదిలో దేదీప్యమానమైన వెలుతురు కనిపించింది. బహుశ ఇంట్లో వాళ్లు నన్ను చూసి ఉంటారు అనుకున్నాను.

అర్ధచంద్రకారంలో ఉన్న మెట్లు ఎక్కి వరండా దగ్గరికి చేరాను. ఇంటి తలుపు తెరిచే వున్నది. తలుపు తట్టనా? కాలింగ్ బెల్ ఎక్కడ? అనుకుంటూ ఉండగా, ఓ పదేళ్ళ కుర్రవాడు వచ్చి నిలబడ్డాడు. "ఎవరండీ మీరు?" అనడిగాడు మర్యాదగా. ఈ మధ్యకాలంలో అంత అందమైన పిల్లవాణ్ణి చూసిన గుర్తులేదు.

"ఏం లేదబ్బాయ్. వీధిలో నడుస్తూంటే వాన మొదలైంది. చెప్పుతెగింది. అందుకని..." నేను చెబుతూండగానే కుర్రవాడి చక్కటి ముఖంలో భావం మారింది. "అయ్యో అలాగా, రండి, అంకుల్" అంటూ లోపలికి దారితీశాడు.

"అబ్బే ఎందుకులే బాబూ! కాస్త వాన నెమ్మదిస్తే వెళ్ళిపోతాను" అన్నాను మొహమాటంగా. కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళిచ్చాడు. బురద కాళ్ళు శుభ్రం చేసుకున్నాను.

"ఫరవాలేదు అంకుల్, రండి లోపలికి"

చిన్నవాడితో మరీ మరీ అడిగించుకుంటే బెట్టుచేసినట్టుంటుందని అబ్బాయి వెనకే లోపలికి నడిచాను.

మరో ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతి కలిగింది.

ఠీవిని ఒలికించే పూర్వకాలపు సోఫాలు, కుర్చీలు, విశాలమైన పెద్ద పెద్ద కిటికీలు, ఎత్తయిన సీలింగ్, దేదీప్యమానంగా వెలిగే పురాతన షాండలియర్, (దీని వెలుగే బయటకి కనిపించి ఉండవచ్చు) కిటికీలకు పల్చని జిలుగు తెరలు గాలికి ఊగుతున్నాయి. అంత పెద్ద హాలుకి సరిపడే బ్రహ్మాండమైన కాశ్మీర్ తివాచీ, గోడకి చేర్చి తాతలనాటి బ్రహ్మాండమైన గోడగడియారం.

గోడలనిండా కళాత్మకంగా అమర్చబడిన తుపాకులు, కత్తులూ, గొప్ప ఫోటో ఫ్రేములూ, వేటాడి చంపిన జంతువులతో తీయించుకున్న జ్ఞాపికలు...ఇంకొక చోట పులిచర్మమూ, దుప్పితలలూ.

గది మధ్యలో పావులు అమర్చిన దంతపు చదరంగం ఆడుతూ మధ్యలో లేచినట్లున్నాడు కుర్రవాడు.

"కూర్చోండి అంకుల్" నవ్వుతూ ఆహ్వానించాడు ఆ పదేళ్ళ పసివాడు. పెద్దవాళ్ళు ఎవ్వరూ లేకుండా ఇంట్లోకి రావటం ఇబ్బందిగా అనిపించసాగింది. ఇదే ఏ అగంతకుడో దురుద్దేశంతో వస్తే..ముక్కుపచ్చలారని పసివాడికీ, ఇంట్లో వస్తువులకీ ఎంత ప్రమాదం?

ఇబ్బందిగా సోఫాలో కూర్చున్నాను. టేబిల్ మీద నున్న రాగిచెంబులో నీరు గ్లాసులోకి వంపి అందించాడు "తీసుకోండి అంకుల్" అంటూ.

పిల్లవాడి అందచందాలు వినయవిధేయతలు చూసి ముచ్చట వేసింది 'మంచిపెంపకం' అనుకున్నాను మెచ్చుకోలుగా.

"నీ పేరేంటబ్బాయి?"

"మహీ అంటారండి. మహీధర భూపతి" ఎక్కడో విన్నట్లనిపించింది.

"మీ అమ్మా నాన్న ఏరి?"

"నాన్న ఊళ్ళో లేరు. అమ్మ, అక్క పేరంటానికి వెళ్ళారు. ఈ పాటికి రావాలి"

"అలాగా, అయితే ఇంత ఇంట్లోనూ మీ ముగ్గురేనా ఉన్నది?" అడగకూడదనుకుంటూనే అడిగాను.

చిన్నగా నవ్వాడు. పచ్చని పసిమి, వత్తయిన ఉంగరాల జుట్టు, దిట్టమైన పులిగోరు గొలుసు, చేతివేళ్ళకు ఉంగరాలు, నల్లటి ముఖ్మలు చొక్కా..తీర్చిదిద్దినట్లున్న కనుబొమ్మలు, గుండ్రటి మెరిసే కళ్ళు, ముఖంలో తెలివితేటలు ఉట్టిపడుతున్నాయి. నాకంతకంతకూ ఈ కుర్రవాడు నచ్చుతున్నాడు. నన్ను వాడి అమాయక రూపం సమ్మోహన పరుస్తోంది.

నా ప్రశ్నకు జవాబుగా 'దాసులూ' అని గట్టిగా పిలిచాడు. ఒక అరవై పైబడ్డ ఆజానుబాహువు వచ్చి వినయంగా నిలబడ్డాడు. నల్లనిరూపం, వేటాడే నిశితమైన చూపులు, చూడగానే ఎంతటివారికైనా జంకు కలగకమానదు.

"ఎన్నో ఏళ్ళనుండి దాసులు మా దగ్గర ఉంటున్నాడు అంకుల్. దాసులూ, కాఫీ తీసుకురా" అంటూ పురమాయించాడు. తలపంకించి వెనుదిరిగి లోపలికి వెళ్ళిపోయాడతను.

ఇల్లూ, పిల్లవాడూ ఇతడి రక్షణలో క్షేమమే అనుకున్నాను. క్షణంలో పొగలు కక్కే కాఫీతో వచ్చాడు దాసులు. పింగాణీ కప్పు తమాషాగా, పాతకాలం చెవుల మూకుడులాగా వున్నది. కప్పు చుట్టూతా రంగురంగుల పూలూ, లతలూ, సన్నటి బంగారు నగిషీ! కప్పు అందుకున్నాను. వేడిగా ఉన్న కాఫీ రుచి అద్భుతంగా ఉన్నది. ప్రాణం కుదుటపడింది.

"అంకుల్, మీరేం చేస్తూంటారు?!" నన్ను నిశితంగా చూస్తూ అడిగాడు. "మిలటరీలో చేస్తున్నానబ్బాయ్. నన్ను వర్మ అంటారు" పిల్లవాడి కళ్ళు తళుక్కున మెరిశాయి. "మీరు మేజరా? కల్నలా?"

గట్టిగా నవ్వాను. "కాదబ్బాయి. ఎక్కౌంట్స్‌లో చేస్తున్నాను"





పిల్లవాడు నిరుత్సాహపడ్డాడు. యుద్ధాలు, శత్రువులు..ఇలాంటి కబుర్లు వినడానికి ఆసక్తిపడ్డాడేమో పాపం.

"ఈమధ్యనే ఈ ఊరొచ్చానోయ్. ఇంకా పరిచయాలేవీ కాలేదు. మా మేనమామగారి ఊరిది. వారు పోయారు. అత్తయ్య ఒక్కత్తే ఉంటోంది. ఆమెను చూసి పోదామని వచ్చాను. నా



చిన్నతనం ఇక్కడే గడిచిందనుకో"

నేను చెబుతూండగానే లేచి తలుపు దగ్గరికి వెళ్ళి గేటు వంక చూసి వస్తున్నాడు.

కాఫీ ముగించి కప్పుకింద పెట్టాను.

అప్పటికీ మహీధర్ నాలుగైదుసార్లు తలుపు దగ్గరికి వెళ్ళి చూచివచ్చాడు.

"అమ్మా, అక్కా యింకా రాలేదే?" అనుకుంటున్నాడు తనలో తాను గట్టిగా.

"ఎటైనా దూరం వెళ్ళారా?" పిల్లవాడి ఆదుర్దా చూసి ప్రశ్నించాను.

"దూరమేలెండి. కానీ రావలసిన వేళ దాటుతోంది" అన్నాడు. ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి "ఎక్కడికి వెళ్ళారు?" అనడిగాను.

అడిగినదానికి జవాబు చెప్పకుండా కుర్చీలో వెనక్కి జారిగిలబడి కళ్ళుమూసుకున్నాడా పసివాడు. కళ్ళు తెరిచి,

"సాయంత్రం ఆరున్నర లోపలి రావాలి, రాకపోతే..."

ఎటో గతంలోకి, మానవదృష్టికి అందని సంఘటనలను చూస్తున్నట్లు ఉన్నాయి ఆ పసివాడి చూపులు.

"రాకపోతే?" అనడిగాను కుతూహలంగా.

దీర్ఘంగా నిట్టూర్చాడు. "ఈ నెల రానట్లే. మళ్లీ వచ్చేనెల ఇదే రోజు ఇదే వేళకి వస్తారు" స్పష్టంగా నెమ్మదిగా చెబుతున్న మహీధర్ వైపు ఆవాక్కయి

చూశాను. యాంత్రికంగా గోడగడియారం వంక చూస్తే ఆరూ ఇరవై ఎనిమిది నిముషాలైంది.

తనను తాను సర్దుకుని నన్నుచూసి సన్నగా నవ్వాడు. వాడి చూపు, గొంతు మామూలుకు మారింది. "అది కాదు అంకుల్, కొన్నేళ్ళ క్రితం ఇదే రోజున, ఇదే వేళకు మా అమ్మా, అక్కా మా బంధువుల ఇంటికి పేరంటానికి వెళ్ళారు. వాళ్ళకూ మాకూ అస్సలు పడదు. అయినా నాన్నగారి బలవంతం మీద తప్పనిసరై వెళ్ళారు.

అక్కడ..అక్కడ..అమ్మనూ, అక్కనూ దారుణంగా చంపేశారు. నాన్న ఇంతకింతా పగ తీర్చుకున్నారులే. వాళ్ళింటికి వెళ్ళి కనబడ్డ వాళ్ళందరినీ షూట్ చేసి మరీ జైలుకెళ్ళారు"

నా మనసులో సన్నగా మొదలైన వణుకు శరీరానికి ఆవహించింది. పెదాలు తడారిపోసాగాయి. వ్యక్తం చేయలేని భావన నన్ను కమ్ముకుంది.

నా పరిస్థితి గమనించనట్టు చెప్పుకుపోతున్నాడు మహీధర్.

"ప్రతీ నెలా ఇదే రోజున అమ్మ, అక్క, ఇదే టైముకి వచ్చి నాతో చాలాసేపు గడుపుతారు. అందరం నవ్వుతూ, కబుర్లు చెప్పుకుంటూ సరదాగా భోజనాలు చేస్తాం. రాత్రికి మళ్ళీ వెళ్లిపోతారు.

చూడండి అంకుల్...ఇంకా రాలేదు" గేటు చప్పుడు కావటంతో బంతిలా చివాల్న లేచి తలుపు దగ్గరికి వెళ్ళాడు. ఆడవాళ్ళ గొంతులు, నవ్వులు గేటు దగ్గర వినబడ్డాయి. అంత వర్షపు హోరులోను.

స్నేహితులు సరదాగా పెట్టిన 'గండర గండడు', 'కలియుగ భీముడు' వంటి బిరుదు లేవీ నాకు ఆ క్షణం గుర్తురాలేదు. గుండె దడ కంచుఢక్కా లాగా చెవులను హోరెత్తించింది. కాళ్ళూ, చేతులూ చచ్చుబడినట్లనిపించసాగింది. భయం, తిమ్మిరిలా వ్యాపించి శరీరాన్ని మొద్దుబారేటట్లు చేయసాగింది.

చచ్చిపోయిన వాళ్ళు నెలనెలా వచ్చిపోవడమేంటి?

రాత్రి దాకా కబుర్లూ, భోజనాలు ఏమిటి?

ఈ పసిపిల్లలాడు ఆ చచ్చిపోయిన వాళ్ళరాక కోసం ఎదురుచూడటమేంటి? మెల్లగా జారుకుంటే మంచిదనిపించి లేవబోతూంటే దాసులు వచ్చాడు.

"దాసులూ! ఏమిటి అబ్బాయి అంటున్నాడు"

"అవును దొరా, అమ్మగారు, అమ్మాయిగారూ చిన్నబాబును చూసిపోవటానికి ఇదే రోజున వచ్చిపోతూంటారు. పాపం ఇంకా రాలేదేమో అని బాబు ఆదుర్దా పడుతున్నాడు వచ్చినట్లున్నారు"

అయితే పిల్లవాడు చెప్పిన కథ నిజమేనన్నమాట.

"అదేమిటి దాసులూ? ఎక్కడా వినలేదే?" అపనమ్మకంగా అన్నాను.

"వినకపోతేనేం దొరా, మీ కళ్ళతో మీరే చూడండి. అదుగో రానే వచ్చారు" తాను కూడా వరండా వైపు నడిచాడు దాసులు.

స్ప్రింగులా లేచాను. గబగబా బయటికి నడిచాను.

అక్కడి దృశ్యం ఈ జన్మలో మరువలేను.

మెరుపు తీగలాంటి స్త్రీ, ఓ చక్కటి అమ్మాయితో మెట్లెక్కి వస్తోంది. తళతళా మెరిసే నగలు కళాకాంతులీనే ఆమె ముఖవర్చస్సుకి వన్నె తెస్తున్నాయి. ఆడపిల్ల అచ్చం మహీధర్ పోలికలోనే ఉన్నది. తల్లి ప్రేమకై అరులు చాచే పసివాడు ఆమెను అల్లుకుని ఉన్నాడు.

పిల్లవాడిని అనురాగంతో పొదివి పట్టుకుని తలుపువైపు వస్తున్నది తల్లి.

ఆ దృశ్యం భయానకమైనది కాదు. మాతృప్రేమ, వాత్సల్యం ప్రస్ఫుటమౌతున్నాయి.

కానీ భయం పొగమంచులాగా నన్ను ఆవరించింది. తెగిన చెప్పులు పట్టుకుని శరవేగంతో గేటువైపు పరిగెత్తాయి. అంత చలిలోనూ, వర్షంలోనూ చెమట ధారాపాతంగా కారుతున్నది.

"అంకుల్ ఆగండి. అమ్మా చూడు"పిల్లవాడు పిలుస్తున్నాడు "దొరా, రండి, దొరా" దాసులు గొంతు గంభీరంగా వినబడుతోంది. వెనుదిరిగే ధైర్యం లేదు. కాళ్ళనిండా బురద. గొడుగు మడవనూ కూడా లేదు. గేటుకు తగిలించిన తాళం కూడా నన్నాపలేకపోయింది. గబగబా గేటు ఎక్కి అవతలకు దూకి పరుగు లంకించుకున్నాను.

దూరాన వాళ్ళ పిలుపులు లీలగా వినిపిస్తున్నాయి. వర్షం ఆగలేదు. అదే కుండపోత. వీధిలో దీపాలు వర్షం ధాటికి ఆరిపోయాయి. దూరదూరంగా విసిరేసి



## నేహా అదృష్టం!

**అ**మెరికా అధ్యక్షుడు ఒబామా పాత్ర ప్రధానంగా 'విత్ లవ్ టు ఒబామా' అనే సినిమా బాలీవుడ్‌లో నిర్మాణం అయ్యేందుకు సన్నాహాలు జరుగుతున్నాయిట. ఇందులో ముఖ్యపాత్రని నేహా ధుపియా పోషించేందుకు అంగీకరించినట్టు వార్త. దీంతో ఒక్కసారిగా నలుగురి దృష్టినీ ఆకట్టుకుంటోంది నేహా. అంతర్జాతీయంగా శాంతి స్థాపన అవసరాన్ని తెలియజెప్పే సందేశంతో నిర్మాణం కానున్న ఈ సినిమాతో అంతర్జాతీయంగా నేహా పేరు తెచ్చుకుంటుందేమో!

నట్లున్న ఇళ్ళల్లో సన్నగా దీపాల కాంతి. తెలియని దిశలో పరుగెత్తి, పరుగెత్తి అలసి కుప్పకూలిపోయాను.

చాలాసేపటికి మెలకువ వచ్చింది. చుట్టూ చూశాను. వీధి తెలిసినదే. ఒక బస్‌స్టాండ్‌లో బెంచీ మీద పడి ఉన్నాను. నెమ్మదిగా జరిగినదంతా గుర్తొచ్చింది. నిజమా? కలా?

బట్టలు ముద్దగా తడిసి ఉన్నాయి. వాన నిజమే!

పక్కనే పడి ఉన్న గొడుగు, తెగిన చెప్పు, అయితే అదీ నిజమే!

నిశిరాత్రి ఒంటరిగా బస్‌స్టాండ్‌లో జారగిలబడి ఉన్నాయి. తలంతా దిమ్ముగా ఉన్నది. జరిగినవన్నీ లీలగా గుర్తొచ్చాయి.

ఆ ఇల్లూ, పిల్లవాడూ, పనివాడూ..చనిపోయిన ఆత్మీయుల రాకకోసం ఎదురుచూడటం...

తల విదిలించి చుట్టూ చూశాను. వీధులు నిర్మానుష్యంగా ఉన్నాయి. వర్షపు చిత్తడికి ఎక్కడ చూసినా బురదగుంటలూ, నీటి మడుగులూ..వీధికుక్కలు కూడా చూరుకింద తలదాచుకుంటున్నాయి. నెమ్మదిగా కాలూ చెయ్యి కూడదీసుకుని లేచి ఇంటివైపు నడిచాయి.

వసారాలో దీపం వెలుగుతోంది. ఇంత రాత్రయినా రాకపోయేసరికి అత్తయ్య పాపం కంగారుపడుతూ ఉండవచ్చు.

"ఎక్కడికి వెళ్లావురా? పొద్దుపోతుందని నాకు చెప్పను కూడా లేదు. బాగా తడిసినట్టున్నావే" అంటూ నా చేతిలోని గొడుగు అందుకుని వసారా చివర్న పడేసింది. "పద, తల తుడుచుకుని, కాళ్ళు కడుక్కో, వడ్డిస్తాను" ఆమె అంటూండగా గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

అంటే సాయంత్రం ఆరున్నర నుండీ స్థిమితం కోల్పోయి ఉన్నానన్నమాట. గబగబా పొడి బట్టలు కట్టుకుని వచ్చి భోజనానికి కూర్చున్నాను. "నువ్వు భోం చేశావా అత్తయ్యా? బాగా పొద్దుపోయింది కూడాను" అన్నాను వయసుపైబడి అలసిన ఆమె ముఖం వంక చూస్తూ.

"రాత్రిపూట ఫలహారమే కదరా, భోజనం మాని పాతికేళ్ళయింది" నిట్టూర్చిందామె. ఇంతకీ వచ్చి రెండు రోజులయినా కాలేదు. ఇంత పొద్దుపోయేదాకా ఎక్కడ తిరిగి వచ్చావు? పొద్దున్నతిన్న నాలుగు మెతుకులే కదా" నిష్ఠూరంగా అన్నది.

సాయంత్రం ఆ ఇంట్లో తాగిన కాఫీ గుర్తొచ్చి పొలమారింది. సర్దుకుని నీళ్ళుత్రాగాను.

భోజనం ముగించి లేచి చేతులు కడుక్కున్నాను.

"అత్తయ్యా! పాత పోస్టాఫీసు ప్రాంతంలో పెద్దగా ఇళ్ళు లేవేం?" ఉపోద్ఘాతంగా అడిగాను, వక్కపొడి వేసుకుంటూ.

"ఏమోరా, భూపతిగారి మేడ దగ్గర కొద్దిదూరంలో కోళ్ళఫారాలు తప్ప పెద్దగా ఇళ్ళంటూ ఎవరూ కట్టలేదనుకుంటా"

"ఎంచేతనో?" సాధ్యమైనంత యధాలాపంగా అడిగాను.

"అవన్నీ భూపతిగారి స్థలాలే, ఆయనేమో లేరాయె. పట్టించుకునే నాధుడెవరు?" నులక మంచం వాల్చుకుంటూ అన్నది.

"ఏం ఆయన ఎక్కడికెళ్ళారు?" అత్తయ్య కొద్దిక్షణాలు మౌనంగా ఉన్నది.

"అవన్నీ ఎందుకులేరా, అర్ధరాత్రిపూట"

నాలో కుతూహలం భయాన్ని తాత్కాలికంగా జయించింది కాబోలు.

"అబ్బ చెబుదూ, చిన్నపిల్లలమా ఏమిటి జడుసుకోవటానికి" తెగిన చెప్పును ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీసిన సంగతిని మర్చిపోవటానికి ప్రయత్నిస్తూ అడిగాను.

"ఎప్పటి సంగతులో!" నిట్టూర్చిందత్తయ్య.

"భూపతిగారి కుటుంబానికి తరతరాలుగా దాయాదులతో శతృత్వం ఉండేది. దయాగుణం, క్షమ కలిగిన మారాజు కాబట్టి భూపతిగారు ఆ శతృత్వాన్ని అంతం చేద్దామనే సదుద్దేశంతో పిలవకపోయినా దీపావళినాడు లక్ష్మీపూజ పేరంటానికి భార్యనీ, కూతురినీ దాయాదుల ఇంటికి కానుకలూ, మిఠాయిలూ ఇచ్చి పంపారు. ఆ దుర్మార్గులు ఆడవాళ్ళిద్దరినీ చెప్పరాని విధంగా అవమానించి చంపేశారు.

విషయం తెలిసిన భూపతిగారు, అంత మంచి మనిషీ తట్టుకోలేక తాను వేటకు వాడే తుపాకీ తీసుకుని వాళ్ళింటికి వెళ్ళి కనబడ్డవాళ్ళందరినీ కాల్చి పారేశారు. తరువాత నేరుగా పోలీసుల దగ్గరకు వెళ్ళి



## కొత్త సుస్మిత

చాలామంది లాగే సుస్మితాసేన్ కూడా ఈమధ్య బోల్డు స్లిమ్ముయిపోయి సరికొత్త గ్లామర్‌తో కొత్త సినిమా చాన్సుల కోసం ప్రయత్నిస్తోందిట. ఆ సంగతలా వుంచితే- ఆమెకి ఇటీవలి కాలంలో మాంచి ఫ్రెండ్ అయింది ఎవరంటే- కంగనా రనౌత్ అంటున్నారు బాలీవుడ్ జనాలు. ఇద్దరూ కలిసి 'నో ప్రాబ్లెమ్' అనే సినిమా చేస్తున్నారు. ఆ సందర్భంగా ఇద్దరూ మంచి దోస్తులైపోయారట. తన సీనియారిటీతో సుస్మితా- కంగనకి బోల్డు సలహాలిస్తోందిట. కంగనా కూడా తల వూపేస్తూ వాటిని పాటించడానికి ట్రయ్ చేస్తున్నానంటోందిట.


తనకు తానే లొంగిపోయారు"

గతాన్ని నెమరు వేసుకుంటూ ఆ నిశ్శబ్దంలో అత్తయ్యగొంతు మంద్రంగా వినిపిస్తోంది.

నాలో అర్థంకాని అలజడి...అపూర్వమైన అందంతో కళ్ళారా నేను చూసిన మాతృమూర్తి గతంలో ఒక భాగం మాత్రమేనా?

"ఇది...నువ్వు చెబుతున్నది జరిగి ఎన్నాళ్ళైంది అత్తయ్యా?"

"ఎన్నాళ్ళేమిట్రా, పిచ్చిసన్నాసీ! ఈ ఊరికి నేను కాపరానికి వచ్చిన కొత్తల్లో...అంటే దాదాపు నలభై ఏళ్ళ క్రితం..."




నిర్విణ్ణుడైనాను. కాలచక్రంలో ఏ ఉరుసులో ఇరుక్కుని ఉన్నానో అర్థం కావటం లేదు.

"మరి..భూపతిగారికి వారసులు లేరా?"

"లేకేం నాయనా, పండంటి పదేళ్ళ కుర్రాడుండే వాడు. ఏమిటమ్మా పేరు? ఆ, మహీ అనేవారు. బంగారుతండ్రి, చెంపకు చారెడుకళ్ళు. చక్కటి ఉంగరాల జుత్తు, చూడటానికి రెండు కళ్ళు చాలవనిపించేవి, తల్లీ అక్కా చంపబడి, తండ్రి జైలుపాలై ఏకాకిగా మిగిలాడు, దాసులు అనే నమ్మినబంటు వాడిని కంటికి రెప్పలా కాపాడేవాడు. ఏం లాభం? నరదృష్టికి నల్ల రాళ్ళు కూడా పగులుతుంటాయంటారు.

భూపతిగారు జైలుపాలయ్యాక దాయాదులు శత్రుశేషం మిగల్చకూడదని ఆ ముక్కుపచ్చలారని పసివాడినీ, కనిపెట్టుకుని ఉన్న పనివాడినీ ఘోరంగా చంపి ఆ ఇంటి బయటే వరండాలో శవాల్ని వ్రేలాడదీశారు.

అంత ఘోరకలి ఈ చుట్టుప్రక్కలా ఏ ఊరూ ఎన్నడూ చూడలేదు.

అదిరిపోయాను. ఒళ్ళంతా చలిజ్వరం వచ్చినట్టు కంపించసాగింది. కాళ్ళకింద భూకంపం వస్తున్నట్టు కూలబడ్డాను. నన్ను నేను కూడదీసుకోవడానికి చాలా వ్యవధి పట్టింది.

నేను సాయంత్రం ఎవరితో గడిపాను? నలభై ఏళ్ళ గత చరిత్రలో వాళ్ళంతా పాత్రలా? కళ్ళకు కట్టినంత నిజంగా జరిగిందేమరి?

"మరి ఆ ఇంట్లో ఇప్పుడెవరూ లేరా? ఇల్లు పాడు బెట్టినట్లున్నదా?" అత్తయ్య నా వంక భయంగా చూసింది.

"నా తండ్రీ! నీకు పుణ్యముంటుంది. ఆ ఇంటివైపు కన్నెత్తి కూడా చూడకు. నువ్వు దేవుణ్ణీ, దయ్యాన్నీ నమ్మవని అందరికీ తెలిసిందే. కానీ ఆ ఇంటి జోలికి మాత్రం పోకు బాబ్బాబు" ఆమె ముసలి ముఖం నిండా భయాల నీలినీడలు.

"ఎవరూ లేరంటున్నావు కదత్తయ్యా! పైగా ఎప్పుడో నలభై ఏళ్ళ క్రితం జరిగిన దుర్ఘటనలు"

ఆమె కంఠంలో ఎన్నడూ వినిపించని కాఠిన్యం అప్పుడు విన్నాను.

"నీకు తెలీదు అయ్యా! ప్రతి అమావాస్యనాడూ చంపబడిన ఆ తల్లీపిల్లలూ, పనివాడూ ఆ ఇంట్లో కాలక్షేపం చేస్తారని చూసిన వాళ్లు చెప్పుకుంటారు. దీపావళి అమావాస్యనాడేగా వాళ్ళు చంపబడిందీ!"

బలవన్మరణాలు పొందిన అమాయక ప్రాణులు...సరైన కర్మకాండలు జరగక, వారికి సద్గతులు ప్రాప్తించలేదనీ, ఇహలోక బంధాల నుండి ఇంకా విముక్తులు కాలేక ఆ ఇంటిని పట్టుకుని వారి ఆత్మలు వేలాడుతున్నాయని పెద్దలు చెప్పుకోగా విన్నాను. మనుషులా ఉత్తములు. కాబట్టి ఒకరికి అపకారం చేసే ఆత్మలు కావు. వారిని నమ్ముకున్న వారంతా లబ్ధిపొందారు. భూపతిగారు జైలుకెళ్ళేదాకా మీ మామయ్య వారివద్దనేగా కొలువుచేసింది. ఆయన ఫోటో మనింట్లో ఎన్నోసార్లు చూశావు"

"మహీధర భూపతి" అని పిల్లవాడు చెప్పినప్పుడు ఏదో స్ఫురించటం గుర్తొచ్చింది.


"చాల్లే పడుకో" భగవన్నామస్మరణ చేస్తూ నిద్రకు ఉపక్రమించింది అత్తయ్య.

కిటికీ బయటికి చూశాను. వాన వెలిసింది. లైటార్పబోతూ యధాలాపంగా తెలుగు కేలండరు వంక చూశాను.

ఒళ్ళు కుదిపివేసినట్లు జలదరించింది. దుప్పటి ముసుగు బిగించి గట్టిగా కళ్ళు మూసుకున్నాను.

అమావాస్య ఘడియలు గతించి అప్పుడే పాడ్యమి ప్రవేశించింది.

○



# అవతార్ సీక్వెల్?

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న హాలీవుడ్ చిత్రం 'అవతార్'కి సీక్వెల్ తీసే ఉద్దేశంలో ఆ చిత్ర దర్శకుడు జేమ్స్ కామరూన్ వున్నట్టు కథనాలు జోరుగా వినిపిస్తున్నాయి. అంతకంటే ఆసక్తికరమైన విషయం ఇంకోటేంటంటే- ఈ 'అవతార్-2'లో ప్రధాన పాత్రని షారుఖ్ ఖాన్ పోషించే అవకాశం వుందిట. కామరూన్ అనుకున్న సబ్జెక్ట్‌ని సెల్యూలాయిడ్‌కెక్కించటానికి పదేళ్లకి పైనే పట్టింది. కానీ ఇప్పుడు టెక్నాలజీ ఎంతగానో ఆధునికమైపోయింది కాబట్టి ఈ సీక్వెల్ నిర్మాణానికి మరీ అంత సమయం పట్టకపోవచ్చు.